నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 | నిజామాబాద్, గురువారం 8 మే 2025 | NIZAMABAD

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన అందాల పోటీలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఐద్వా ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అందాల పోటీలు నిర్వహిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. – కంఠేశ్వర్, మే 7

ఆపరేషన్ సిందూర్
ఆనందంలో ఇందూర్

కామారెడ్డి, మే 7 : పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో ప్రతీ భారతీయుడి హృదయం ఉప్పొంగింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పడంతో ఇందూరు మురిసింది. కోడి కూయక ముందే భారత సైన్యం వెల్లడించిన శుభ వార్తపై అంతటా హర్షం వ్యక్తమైంది. మన సైన్యం ప్రతిభా పాటవాలపై ప్రతి ఇంటా చర్చ సాగింది. సోషల్ మీడియా మొత్తం ఇదే వార్తలతో నిండిపోయింది. భారత సైనిక సత్తా, సామర్థ్యాలను కీర్తిస్తూ వాట్సప్ స్టేటస్‌లు, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ తదితర ప్లాట్‌ఫామ్‌లపై పోస్టులు వెల్లువెత్తాయి.

హర్షాతిరేకాలు..

పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ దాడులు చేయడం, ఉగ్రవాద ఉత్పత్తి కేంద్రాలను నాశనం చేయడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆనందంలో మునిగి పోయారు. కేవలం పాతిక నిమిషాల్లోనే ఆపరేషన్ ముగించడం, పాక్ లోపలికి వెళ్లి విజయవంతంగా దాడి చేసి, ఏమాత్రం నష్టం లేకుండా తిరిగి రావడంపై పరవశం చెందారు. మన సైనిక సత్తాకు ఇది నిదర్శనమని సోషల్ మీడియాలో హర్షం వ్యక్తం చేశారు.

సైన్యం వెంటే ఉంటామని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రతీ కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ గురించే రాజకీయ నేతలు, అధికారులు, యువత ప్రతి ఒక్కరూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకున్నారు. మన సైన్యం ప్రదర్శించిన ధీరత్వంతో భారతీయుడిగా గర్విస్తున్నానని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా పీచమణచాల్సిందేనన్నారు. పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవడం ద్వారా పహల్గామ్ బాధితులకు న్యాయం జరిగినట్లయిందని జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేశారు.

భారతీయుడిగా గర్వపడుతున్నా..

మోర్తాడ్, మే 7: భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పోరాటానికి భారతీయుడిగా గర్వపడుతున్నా. ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేది తప్ప లాభం చేకూర్చేది కాదు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతిసామరస్యాలు నెలకొంటాయి.

- వేముల ప్రశాంత్‌రెడ్డి,
మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే

కోనాసముందర్‌లో సొసైటీ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

గిసుంటి సీఎంను చూడలే..

- రాష్ట్ర పరువు తీసేలా మాట్లాడిండు
- రైతులు కష్టాల్లో ఉంటే అందాలు పోటీలు పెడ్తరా?
- ఫెయిల్యూర్ సీఎంను మార్చి మరొకరిని పెట్టాలి
- ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సీడీపీ నిధులు ఇస్తలేరు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం
- వడ్ల కొనుగోలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ప్రశ్నించినందుకు నిధులిస్తలేరు..

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించినందుకే కక్షగట్టి 17 నెలల కాలంలో ఒక్కరూపాయి కూడా సీడీపీ నిధులు ఇవ్వలేదని ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎమ్మెల్యేకూ ఏడాదికి రూ.5 కోట్లు సీడీపీ నిధులు ఇవ్వాల్సి ఉండగా, బాల్కొండకు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజలకు ఇచ్చిన హామీల కోసం కచ్చితంగా కొట్లాడుతానని చెప్పారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా రాజ్యసభ సభ్యులను, ఎంపీలను కలిసి నిధులు తీసుకొస్తానన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, నేతలు రాధాకిషన్, ప్రకాశ్, గడ్డం స్వామి, లుక్కగంగాధర్, పురుషోత్తం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్, మే 7:ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో పాటు, అకాల వర్షాలతో రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు.. వాళ్లను ఆదుకోవాల్సిన సర్కారు అందాల పోటీల నిర్వహణలో బిజీగా ఉందని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. కమ్మర్‌పల్లి మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వేముల విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. ఉద్యోగులు డిమాండ్లు తీర్చాలని అడుగుతుంటే, అప్పు పుడ్తలేదని మాట్లాడుతున్నారని, నన్ను కోసుకుని తినుండ్రి అని మాట్లాడడం ఏమిటని మండిపడ్డారు. రాష్ట్ర పరువు తీసేలా మాట్లాడిన గిసుంటి సీఎంను ఎప్పుడు చూడలే అని ఎద్దేవా చేశారు. పరిపాలన చేతకాకపోతే దిగిపో.. కానీ రాష్ట్రం గురించి దివాళకోరు మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు.

ధాన్యం సమస్యలను పరిష్కరించండి..

అందాల పోటీలపై దృష్టి పెట్టడం కంటే ముందు అన్నదాతల సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రశాంత్‌రెడ్డి హితవు పలికారు. జిల్లాలో 14 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండితే 10 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ చేయాలని లక్ష్యం పెట్టుకున్నారని, 6.95 లక్షల మెట్రిక్‌టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తూకం వేయకుండా కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల్లో ఉన్నాయన్నారు. ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల వడ్లను తరుగు కింద తీసేశారని, అంటే క్వింటాలుకు 5 కిలోల తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. యంత్రాంగం కాంటాల్లో వేగం పెంచడంతో పాటు తరుగు అరికట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా ఒక్కరైతుకు కూడా బోనస్ రాలేదన్నారు.

చేతకాక తప్పుడు ప్రచారాలు..

హామీలు నెరవేర్చలేక, అప్పు విషయంలో తప్పుడు లెక్కలు చెప్తూ కేసీఆర్ పాలనపై నిందలు వేస్తున్నారని వేముల ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని, వాటితో తెలంగాణకు ఆస్తులు సృష్టించాడన్నారు. 24 గంటల విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ, సెక్రటేరియేట్, 33 మెడికల్ కాలేజీలు, దవాఖానలు, రైతుబంధు ఇలా అనేక అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. మరీ 17 నెలల్లోనే 1.60లక్షల కోట్లు అప్పు చేసిన రేవంత్‌రెడ్డి.. ఢిల్లీకి మూటలు పంపిస్తున్నాడే తప్ప రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని అన్న చేసిండా? అని ప్రశ్నించారు.

చిరుతల మృత్యుఘోష

చిరుత కళేబరం వద్ద అటవీశాఖ అధికారులు

- కంచెలు లేక ప్రాణాలు బలి
- సంరక్షణ చర్యలు కరువు
- హైవే దాటుతుండగా ప్రమాదాలు
- నాలుగు కిలోమీటర్ల పరిధిలో నాలుగు చిరుత పులులు బలి

ఇందల్వాయి, మే 7: సరైన సంరక్షణ చర్యలు లేకపోవడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకొని అటవీ ప్రాంతం ఉన్నది. ఇది పలు రకాల వన్యప్రాణులకు ఆవాసంగా మారింది. హైవేకు ఇరువైపులా కంచె లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్డు దాటుతూ వన్యప్రాణులు మృతిచెందుతున్నాయి. కేవలం నాలుగు నెలల సమయంలోనే ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలో చంద్రాయన్‌పల్లి అటవీప్రాంతంలో నాలుగు చిరుత పులలు మృతిచెందడం ఆందోళన కలిగిస్తున్నది.

నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే ప్రమాదాలు..

ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కేవలం నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డుపై వాహనాలు వేగంగా వెళ్లడంతో వన్యప్రాణులకు ఢీకొని మృతిచెందుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ 15న కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం దగ్గి అటవీ ప్రాంతంలో రెండేండ్ల వయస్సు ఉన్న చిరుత మృతిచెందింది. 2018లో మే 11న జరిగిన ప్రమాదంలో దేవితండా వద్ద మరో చిరుత మృతిచెందింది. 2023, ఫిబ్రవరి 9న దగ్గి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో చిరుత బలైంది. తాజాగా బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మూడు నెలల చిరుత మృత్యువాత పడ్డది. కాగా ఈ ప్రమాదాలు అన్నీ కేవలం నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే జరగడం గమనార్హం. వన్యప్రాణులు రోడ్డుపైకి రాకుండా కంచె ఏర్పాటు చేయకపోవడం వాటి పాలిట శాపంగా మారింది.

వసూళ్లపైనే నిర్మాణ సంస్థ దృష్టి..

జాతీయ రహదారి నిర్మాణ సంస్థ కేవలం వసూళ్లపైనే దృష్టి పెట్టిందని వన్యప్రాణి ప్రేమికులు ఆరోపిస్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద వసూలు చేయడం తప్ప, అటవీ జంతువులు మృత్యువాత పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు రోడ్డుపైకి రాకుండా కంచెను ఏర్పాటుచేశారు. కానీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాత్రం అలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం..

జాతీయ రహదారి నిర్మాణ సమయంలోనే రక్షణగా కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా నిర్మాణం చేపట్టాలని రోడ్డు శాఖ అధికారులకు విన్నవించాం. అటవీ ప్రాంతంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని టోల్ ప్రాజా అధికారులను కోరాం. రోడ్డుపై వెళ్లే వాహనదారులు వన్యప్రాణులను దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలి.

- సంజయ్‌గౌడ్,
ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో, ఇందల్వాయి

గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

ఇందల్వాయి, మే 7: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిరుత మృతి చెందింది. ఇందల్వాయి ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై వెళ్తున్న సుమారు మూడు నెలల వయస్సు ఉన్న చిరుతను గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. చిరుత కళేబరాన్ని తిర్మన్‌పల్లి కేంద్ర నర్సరీకి తరలించి, పోస్టుమార్టం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో తెలిపారు. ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఇప్పటికే సుమారు ఆరు చిరుత పులులు మృతిచెందడంతో జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం చేసినందుకు..

కామారెడ్డి, మే 7 : పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం వహించినందుకు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణను సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి డీఐజీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఏడాది క్రితం టేకుల రాజయ్య అనే వ్యక్తి పాసుపోర్ట్ దరఖాస్తుపై విచారణ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు పేర్కొన్నారు. కనీస ప్రాథమిక పరిశీలన లేకుండానే క్లియరెన్స్ ఇచ్చారని వెల్లడించారు. సమగ్ర విచారణ చేయలేకపోవడంతో రాజయ్యకు అంతకుముందే రాజు అనే పేరుపై ఉన్న పాస్‌పోర్టు గురించి తెలుసుకోలేకపోయారని పేర్కొన్నారు. అనంతరం రాజయ్యపై రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. బాధ్యతారాహిత్యంతో ఇందుకు కారణమైన హెడ్‌కానిస్టేబుల్ కృష్ణను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కామారెడ్డిలోని నిజాంకాలనీ చౌరస్తాలో పటాకులు కాలుస్తున్న యువకులు

కామారెడ్డి పట్టణంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

టీయూ వీసీకి లేఖను అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం

సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తున్నాం

డిచ్‌పల్లి, మే 7: టీయూ పరిధిలో త్వరలో నిర్వహించనున్న సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తున్నామని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు టీయూ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరికి బుధవారం లేఖను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కాలేజీల మనుగడ అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.



లింగాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కామారెడ్డిలో భారీ వర్షం

- జిల్లాకేంద్రంలోని గంజ్‌లో తడిసిన ధాన్యం బస్తాలు
- ఆరబెట్టేందుకు రైతుల తిప్పలు

కామారెడ్డి, మే 7 : జిల్లాకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం కురిసిన అకాలవర్షానికి ధాన్యం తడవగా.. రైతులు తిప్పలు పడి ఆరబెట్టారు. ఈలోపే మళ్లీ భారీ వర్షం కురిసి ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని గంజ్‌లో, మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో రైతులు ఆరబోసుకున్న వడ్లు తడిసి ముద్దయ్యాయి. కష్టపడి పండించిన వడ్లను అమ్ముకుందామనుకునేలోపు అకాల వర్షం కురిసి తడిసిపోవడంతో తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించే అధికారులే లేరని వాపోతున్నారు. తమకు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. లింగాపూర్‌లో ఈదురుగాలులకు చెట్లు విరిగాయి. పలు ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

సీట్ల కోసం మహిళల సిగపట్లు

- ఆర్టీసీ బస్సులో కొట్టుకున్న మహిళలు
- రోడ్డుపై బస్సును నిలిపివేసిన డ్రైవర్
- పోలీసులకు ఫిర్యాదు.. మహిళలకు కౌన్సెలింగ్

సీటు కోసం గొడవ పడడంతో నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

లింగంపేట, మే 7: ఆర్టీసీ బస్సులో సీటు కోసం మహిళలు గొడవపడగా బస్సును డ్రైవర్ రోడ్డుపైనే నిలిపివేసిన ఘటన లింగంపేట మండలకేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి డిపోనకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు లింగంపేట నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తుండగా.. పలువురు మహిళలు అందులో ఎక్కారు. బస్సులో ఎక్కిన మహిళలు సీటు కోసం గొడవపడ్డారు. వారి మధ్య మాటామాట పెరగడంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన నిలిపివేశారు. మహిళల గొడవ తీవ్రం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సీటు కోసం గొడవపడిన మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి, అక్కడి నుంచి పంపివేసినట్లు ట్రైనీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.



మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం బస్తాలు



లింగాపూర్‌లో ఆరబెట్టిన ధాన్యంలోకి చేరిన వర్షపు నీరు